# ఉద్బోధ ★

రచయిత :
"చాణక్య"

"తప్పించుకోటా"నికీ "తనకీ" మధ్య అడ్డంగా వుంది ఆ తలుపు.

అందుకే ఆ జాలిచూపు...కాదు అది జాలి కాదు...ఇంకేదో...అర్థంకాదు. కాని ఆ తలుపు తూట్లుపడుతుందేమో?

"ఆఁ వచ్చేవా...రా"

మత్తుగా వినపడింది మంచంమీదనున్న మగ వానికంఠం.

జవ్వని జలదరించింది. కనుబొమలు ముడిచింది.

"ఆగు...నీతో కొంత మాట్లాడాలి"

"ఊఁ..."

"నువ్వెవరో నాకు తెలీదు...నేనెవరో నీకు తెలిసుండొచ్చు...ఒక వేశ్యనని పొరబడుతున్నావు ...ఈ వ్యభిచారం నాకిష్టం లేదు...ఇది నాకు చావుతో సమానం.

"చచ్చేస్థితిలోనున్న యే ప్రాణికైనా ఆశ వుంటుంది...ఉద్దేశం అన్నది వుండకపోదు. అందుకే నేను నా ఆశనీ ఉద్దేశాన్ని చెపుతున్నాను.

"ఈ వ్యభిచారాన్ని తప్పించుకోటానికి చావొక్కటేనని అందరి అభిప్రాయం...నా అభిప్రాయంకూడా అదే...లోగడ యిలాంటి పరిస్థితే జరిగినప్పుడు చచ్చిపోదామనుకున్నాను. కాని చచ్చి సాధించేదేమీలేదు...బ్రతికి సాధించలేవా?...నీవు పిరికివా?...నీకూ చదువులేని ఆడదానికివున్న వ్యత్యాసము యేమిటీ?" అని 'చదువు' నన్ను ప్రశ్న వేసింది. అందుమూలానే యిన్నిరోజులూ యీ వ్యభిచారానికి దూరంగావుండి, చచ్చిపోకుండా వున్నాను...మొఖం వాచేటట్టు తిడితే...మావాళ్ళందరూ మర లేరు...మళ్ళీ యిప్పుడు మొదటికొచ్చేరు. కానీ యీనాడు ఆవేళలాగ సాధించలేక పోయాను...ఇది నా ఆఖరి ప్రయత్నం...నెగ్గలేనా...విచారం లేదు...ఆత్మహత్య నన్నాదరిస్తుంది.

"చూడూ నీవూ మానవుడవే...నీకూ హృదయంవుంది. ప్రకృతిప్రసాదమయిన విజ్ఞానంవుంది...

"వన్యమృగాలకికూడా ఆరెండూ వున్నాయి ...కాని నీకూ వాటికీ భేధంలేదంటే నువ్వొప్పుకోవు. 'నాకు మాటలువచ్చు వాటికిరావు...నాబుద్ధి వాటి బుద్ధికంటే బహుగొప్పది' అని బల్లగుద్ది చెపుతావు.

"కాని ప్రయోజనంలేదు. కామంలో నువ్వు వాటికంటె కొండంతగొప్పవాడివి...క్షమించు నిన్ను తట్టటంలేదు.

"నేనెవరినో నాకుతెలీదు...నా తలిదండ్రు లెవరో నాకుతెలీదు...నాకుతెలీని నాతల్లి వేశ్య కావచ్చు...కాని దానికి కారకులెవ్వరు? ఆమెకా తలవంపు తెచ్చిందెవరు?...తలిదండ్రులకీ, అన్నదమ్ములకీ, అక్కచెల్లెళ్లకూ ఆమెను దూరంచేసిందెవరు?

యవ్వన స్వప్నాలకీడ్చి వ్యభిచారానికామెను పురికొల్పిందెవరు?...'పెళ్ళికూతురి'నామానికామెను దూరంచేసిందెవరు?...'తల్లి'కున్న స్వభావాన్ని ఆమెకు మరపించిందెవరు?...ఆత్మనీ, దేవుణ్నీ, ప్రేమనీ మందుకైనా కనపడనీకుండాచేసి, ఆమెను వ్యభిచార నరకంలో పడేసిందెవరు?...నిమిషాలమీద ఆధారపడిన శరీరసుఖాల్ని ఆమెచే పూజింపజేసిందెవరు?...అమాయక హృదయాలను చంపటానికి ఖూనీకోరు కళ్ళతో ఒక జిత్తునవ్వు నవ్వటం నేర్పిందెవరు? హృదయం లేకుండా...స్త్రీకి పరమ శత్రువైన నువ్వే...పురుషుడవే...

నీచెల్లికీ, నీకూతురికీ, కడకు నీసహచరిణికికూడా పవిత్రమైన యిల్లుని మరపించి, నిమిషనిర్మితమైన ఒక సుఖానికీ, పడిపోతున్న నీలాంటి హృదయాలకు ఒకశాంతి నివ్వటానికీ...వారిచేత అఖండ త్యాగం చేయించి, సుఖపడుతున్నదిమాత్రం నువ్వే....నువ్వు

నీభార్యని ప్రేమించటంలేదు. కనుక నే మాఅమ్మ వేశ్య అయింది. ఆమెవేశ్య...ఎందుకంటే ఆమె లేకపోతే నీస్నేహితుని సతినైనా, నీపొరుగింటివాని కూతుర్నయినా, నీక్రింద పనిచేసేవాని చెల్లెలినైనా నువ్వు తప్పక మానభంగం చేసేవాడివి. ఆమెవేశ్య...ఎందుకంటే నువ్వు...పురుషులు వేశ్యాలోలురు కనుక...'' ఒక గుటక వేసింది.

''నన్నుకూడా అలా చేయదలచుకొన్నారు. మావాళ్ళు నువ్వూకలసి...నాకు చదువుచెప్పించేరు ...నాశక్తినంతా ఉపయోగించి సర్వవిద్యల్లోనూ నిర్విఘ్నంగా విజయంపొందేను.

''చదువుతో సంబంధంవున్న ప్రతివ్యక్తీ తాను చేసే పనినిగూర్చి ఆలోచిస్తాడు. మనసుచెప్పేది వింటాడు. ఆచెప్పేమాట తప్పైతే దిద్దుకుంటాడు ఆదర్శాల తీసుకొని.

''వ్యభిచారంగురించి వేరే ఆదర్శం'' అనుభవం నాకక్కరలేదు...మాయిల్లే దానికి పుట్టినిల్లుకనుక.

''కానీ చూడూ బుట్టలోపళ్ళన్నీ కుళ్ళిపోయినా మంచి పండొక్కటయినా ఉండకపోదు... ఆపండునితీసి నువ్వే వేరేవుంచి, చెడిపోకుండాచూసి తింటావు. ఆ అభిప్రాయం నీమనసుకొక్కసారి తెచ్చుకో...

''వ్యభిచారం...

''ఎంత కఠోరంగా ఉందోచూడు...దీనివల్ల నేకదా ఎన్నో కొంపలుకూలేయి. ఎందరోప్రభువులు పొట్టకిలేక పరుగులెత్తేరు. ఎన్నోరాజ్యాలు తలక్రిందులయ్యేయి. ఎందరోపామరులు దానిగుట్టు తెలిసికొని, దానిగూర్చి ఆలోచించి, తలలు బ్రద్దలుచేసుకొని జ్ఞానులైయ్యేరు.

''ఆవిషయం నువ్వేమైనా ఆలోచించేవా?... వ్యభిచారం అంటే ఏమిటి?...అసలు వేశ్యఅంటే



ఎవరు?...ఎక్కడో ఎప్పుడో, కామానికి కాలుజారి, ఏపెళ్ళిగాని పడుచో, ప్రియాసంగమంచేసి, పట్టువడుంటే దానిని బహిష్కరించేరు యీపురాణవేత్తలు. ఆతరుణి వేరే గత్యంతరంలేక సంఘాన్నెదిరించి, మీవంటివారి అదను కనిపెట్టి వ్యభిచారవృత్తి స్థాపకురాలైయింది. పొట్టకులేక పుట్టినసంతతి!...కాదు చేసుకున్న భార్యనికూడా యీతరుణికి అమ్మేశాడేక అభాగ్యుడు...అలా ఆమె వృత్తి పెంపొందింది... వారేవేశ్యలు.

"ఆపిల్లలకి, ఆభార్యకి ఉద్దేశాలు వుంటాయని వీరనుకోరు. ఉన్నా అవి పనికిరావు వీరిముందు. వారియిష్టం పనికిరాదు. అంతా తమయిచ్ఛే, ఏ వ్యక్తితో పొమ్మంటే వాడితోపోవాలి. వారిభావాల్లో వీరు బొమ్మలు, యంత్రాలు. అంతే...చూడూ ప్రతి వ్యక్తికి స్వతంత్రత వుండాలా? నీకు ఉద్దేశం అనేదుంటుందా?...

"చెప్పు...

"అలాంటప్పుడు నీకిష్టంవున్నది నువ్వుచేస్తావు. ఒకరుచెప్పింది నీకిష్టంవుంటే ఆచరణలోపెడతావు ...అంటే ఒకరి యిష్టానికీ నీకూ కొంతసంబంధం ఉండినమాట.

"ఇక్కడ (ఈపరిస్థితిలో)...

"వ్యభిచారం" నిన్ను పురికొల్పి నిన్ను యిక్కడికి (యీయింటికి) తీసుకొచ్చింది.

"కాని అది నన్నుచంపి ఎక్కడికో తరిమేస్తుంది...తలచుకో...చచ్చిపోవటం అంటే ఏమిటో ఒకసారి తలచుకో...

"నువ్వు యీవ్యభిచారం చేయటానికి కలిగిన కారణం ఏమైయినా అవ్వనీ...కాని...దాని పర్యవ


మదనకామేశ్వర లేహ్యము




బలవర్ధకమయినది. దేహమునికొక్క నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తినికలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 1-12-0.

రోజాపుష్ప లేహ్యము

మధురమయినది, మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు మూలవ్యాధి మొదలగు వాటిని హరించి కాలవిరేచనమును చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 0-14-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాటలాగు ఉచితం.

పి. సి. ఏ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం- పెరిదేపి, నెల్లూరుజిల్లా.



చేతిపనుల
వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పప్పరమెంట్లు, మందులు మొదలగునవి సులభముగాతయారుచేయుపరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు కొత్తపద్ధతులు డ్రాయింగులతో గలవు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీగ్రంథము చూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీవారికిని ముఖ్యముగా చేతిలో వుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,

12, అరుణాచల మొదలివీధి, 18, వీటు, మద్రాసు.

సానం...ఒకబలి! అంటే నాచావు...నీకుసుఖం అయిందన్నమాట...ఇదీ మనిద్దరికీవున్న సంబంధం.

"వేమనకూడా నీవంటివాడే. నీకంటే గొప్పతనం అతనిలో ఏముంది? అదే ఆలోచించు. అతడు స్త్రీ, కామం అంటే ఏమిటో కనిపెట్టేడు. జ్ఞాని అయిపోయాడు. ఇప్పటికీ సజీవుడే అతడు. నువ్వెందుకలా కాకూడదు...

"చూడు...స్త్రీ అన్నదానిని నగ్నంగా చూడు...అబ్బా అసహ్యమేయటం లేదూ...కుళ్ళు, కపటంతోకూడిన ఆస్వరూపం ఎంత నీచంగా వుందో చూడు..."

ఆయువకుని మత్తు కొంతమాయమయింది.

"పోనీ...నేను నీకు కావాలి...అంతేనా. యువకుడివి...ప్రస్తుతప్రపంచం యింత ఉన్నతస్థితిలోనున్నప్పుడు, నువ్వు అన్యాయాన్ని సహించలేవు...దానిరూపు మాపాలనుకుంటావు. ధర్మంకోసం పాటుపడతావు...మానవాభ్యుదయాన్ని యింకా వృద్ధిలోకి తీసుకుపోవటానికి ప్రయత్నిస్తావు.

"ఇవన్నీ నీవు చేయకపోయినా అన్యాయాన్ని మాత్రం నీవు సహించలేవు...అంతేనా?...అది నీకు కలగనీ, యింకెవరికైనా కలగనీ నీభావంమాత్రం ఒక్కటే. అన్యాయం అంతరించాలి" అంటావు.

చూడు

"నాకిప్పుడన్యాయం జరుగుతుంది...నేను చదువుకున్నదాన్ని...ప్రస్తుత ప్రపంచానికి పనికివచ్చే వ్యక్తిని...జాతిమతానికీ, పుట్టుపూర్వోత్తరాలకీ, ఆఖరికి యీ వ్యభిచారానికికూడా నేనమాయకురాలిని. అది నామాటలవల్లే నీవర్థం చేసుకోవచ్చు.

"నేనిప్పుడు వ్యభిచారం అనే కత్తిమొనమీద ఊపిరి బిగబట్టికున్నాను.

"కాపాడాలన్నా నువ్వే...చంపాలన్నా నువ్వే...

"అలాంటప్పుడు...అన్యాయాన్ని అడుగంట అణచేయటానికి కంకణంకట్టిన నీవు నన్ను కాపాడటానికి ఎందుకు ప్రయత్నించకూడదు. నీకిష్టంలేకపోతే యింకొకనికెందుకు పెళ్ళిచేయకూడదు...అలా చేస్తే...నాకెంత మేలుచేసిన వాడవవుతావో ఆలోచించు.

"నాహృదయం ఎంత తపిస్తుందో యిప్పుడు నీకు తెలిసుండొచ్చు...నిర్దయా స్వరూపాలయిన వాళ్ళ నెంతవేడినా ప్రయోజనం లేకపోయింది...పైగా ఒళ్ళు పుండుజేసుకున్నాను.

"ఆఖరికి..." ఆమెకంఠం వణకింది.

"నువ్వొక్కడివే మిగిలావు...నా ఆశలకు అఖరిస్థానమువ్వే...అనుకొని తెగించి యింతా చెప్పేను. దీనివల్ల నేను లాభంపొందుతానో పొందనో అన్నభావం నాకనవసరం...నేను చెప్పవలసింది చెప్పేను...అది చెప్పితీరాలి...అంతే....ఇంక నీ యిష్టం.

"కాని...వ్యభిచారంవల్ల నీవొక హత్యచేశావని మరచిపోవద్దు...ఆవిధంగా నీవొక తీరని అన్యాయం చేశావని తలచుకో...ఇంకొకటి...స్త్రీ...అంటే ఏమిటో చూచి ఆనందించు" అని కుడిభుజం వైపు మెడత్రిప్పి చీర...

"ఆగు...అంతనగ్నం ప్రస్తుత యువకునికక్కరలేదని తెలుసుకున్నాను నీమాటలవల్ల...ఆ దృశ్యం నేనాలోచించగలను, 'పెళ్ళి' అన్నపవిత్రనామానికది తీరని కళంకమని కనిపెట్టేను" అని పొంగివస్తున్న ఆమె కన్నీటిధారకు చలనంలేని దిమ్మె అడ్డుపడ్డాడు...

కథాంజలి

## బహుమానాలు

ఈనెలలో చక్కనికథ రచించినవారు టి. చాణక్య, కేరాఫ్ టి. నరసింగరావు, సిటీ మెడికల్ స్టోర్సు, మెయిన్‌రోడు, విజయనగరం వారికి రూ. 3-0-0 బహుమానం.

•

తమాషాల శీర్షికకు పంపిన మంచి తమాషా వ్రాసిన కె. ఎన్. రెడ్డి, హిందూ హాస్టల్, గుల్బర్గ. వీరికి ఒక రూపాయి బహుమానం యిచ్చినాము.

సం॥ క॥